క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కంచిలి, ఇచ్ఛాపురం: కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ విషయాన్ని పలాస డివిజన్ విద్యుత్ ఈఈ జి.ప్రసాదరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో సీటీ ఫెయిల్ అయ్యిందని.. దాన్ని మార్చే ప్రక్రియ ఈ సమయంలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వీల్‌చైర్ వితరణ



కృష్ణారావుకి వీల్‌చైర్ అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం గ్రామానికి చెందిన గాలి కృష్ణారావు కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. ఇతనికి ఉపయోగంగా ఉండే వీల్ చైర్‌ను సొండిపూడి గ్రామానికి చెందిన శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్, సొండిపూడికి చెందిన స్వచ్ఛంద సంస్థ సభ్యులు సమకూర్చారు. దీన్ని బాధితునికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధుల మల్లారెడ్డి భాస్కర్, నారాయణరావు, చింతల లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు, కాళీ, పురుషోత్తపురం గ్రామస్తులు పప్పల ప్రతాపరెడ్డి, ఎస్.ధర్మరాజు ఉన్నారు.

ఘనంగా నీలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడలో నీలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, మహిళలచే కుంకుమ పూజ సహస్రనామ మర్చన చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశార. రాత్రి భజనకాలక్షేపం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతతో ఇబ్బందులు

వజ్రపుకొత్తూరు రూరల్: వాతావరణంలో సోమవారం భిన్నమార్పులు కనిపించాయి. ఒక వైపు ఎండ తీవ్రత, మరో వైపు వడగాడ్పులు వీయడంతో జీవరాశులు విలవిల్లాడాయి. ఉక్కపోతతో ప్రజలు కూడా ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురవగా.. వజ్రపుకొత్తూరు మండలంలో మాత్రం ఎండ తీవ్రత కనిపించింది.

ఎమ్మెల్సీ పరామర్శ



పరామర్శలో రామారావు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి గొల్లవీధిలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాళ్ల యశోదమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం యశోదమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు. కొరికాన రాజు తదితరులున్నారు.

సిమెంటు రేకులు వితరణ



సాయం చేసిన ఎస్‌జీఎఫ్ సంస్థ సభ్యులు

కవిటి: బడ్డాయిపుట్టుగ పొట్టివీధికి చెందిన పొట్టి దుర్యోధన ఇంటి నిర్మాణానికి ఎస్‌జీఎఫ్ సంస్థ ఆర్థిక సహకారంతో సిమెంట్ రేకులు కొనుగోలు చేసింది. వీటిని సంఘ సభ్యులు దుర్యోధనకు సోమవారం అందజేశారు. పూరి గుడిసెలో నివసిస్తున్న దుర్యోధన దీనస్థితిపై స్థానికులు సూచన మేరకు ఎస్‌జీఎఫ్ సంస్థ ఈ సాయం అందించేందుకు రూ. ఏడు వేలు విలువైన రేకులను వితరణగా అందించింది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

నరసన్నపేట: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు అన్నారు. స్థానిక సిటిజిన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఓ బంగారం వర్తకుని సహకారంతో పోలాకి రోడ్డులోని జీసీ హోం వద్ద స్టాపర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని సీఐ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మెయిన్ రోడ్డుతోపాటు పోలాకి రోడ్డులో కూడా దేశవానిపేట వరకు ట్రాఫిక్ బాగా పెరిగిందన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం!

- ఫ్లైఓవర్ కోసం ఎదురు చూపులు
- గేట్ వేస్తే అరగంట ఆగాల్సిందే
- అభివృద్ధికి నోచుకోని అండర్ పాసేజ్
- పట్టించుకోని పాలకులు, రైల్వే అధికారులు

ఇచ్ఛాపురం రూరల్:



గేట్ పడటంతో ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలు

ఇచ్ఛాపురం పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. పెరుగుతున్న జనాభాతో పాటు వాహనాల సంఖ్య కూడా పెరగడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఎం.తోటూరు వద్ద ఉన్న రైల్వే నార్త్ కేబిన్ ఎల్‌సీ రైల్వే గేట్ ప్రజలకు కష్టాలను చూపిస్తోంది. ఈ రైల్వే మార్గంలో ప్రతీ ఐదు, పది నిమిషాలకు ఒక ట్రైన్ నడుస్తుండటంతో గేట్ తీసిన ఐదారు నిమిషాల వరకు ట్రాఫిక్ సమస్యతో వాహన చోదకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇచ్ఛాపురం నుంచి మండపల్లి, రత్తకన్న, కొళిగాం ప్రాంతాలకు వెళ్లే ఎం.తోటూరు వద్ద ఉన్న ఈ ఎల్‌సీ గేట్‌పై నుంచి రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు సంబంధించి సుమారు 30 గ్రామాల ప్రజలు వైద్యం, విద్య, వ్యాపారం, షాపింగ్ కోసం నిత్యం వేలాది మంది ఇచ్ఛాపురం రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా రైల్వే గేట్‌కు అవతల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రైవేటు జూనియర్ కళాశాల తోపాటు డిగ్రీ కళాశాల, ప్రైవేటు హైస్కూల్, సినిమా హాల్, షాపింగ్‌మాల్, ప్రైవేట్ డాక్టర్స్ ప్లజా ఉన్నాయి. దీంతో వందలాది మంది విద్యార్థులు, ప్రయాణికులు, రోగులు, వ్యాపారులు మండపల్లి, రత్తకన్న వైపు రాకపోకలు సాగిస్తుంటారు. ఎం.తోటూరు, రత్తకన్న వైపు ఉండే గ్రామాల్లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే మెరుగైన చికిత్స కోసం ఇచ్ఛాపురం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకురావాల్సిందే. ఇదే సమయంలో రైల్వే గేట్ వేసి ఉంటే అరగంట వరకు క్షతగాత్రులు నరకం అనుభవించాల్సిందే. గేట పడిన సందర్భంలో చాలామంది రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోయిన సందర్భాలు ఉన్నాయి.

తప్పని కష్టాలు

ఇచ్ఛాపురం నుంచి కొళిగాం, మండపల్లి, బిర్లంగి, హరిపురం, బాలకృష్ణాపురం, కీర్తిపురం, పాయితారి, తోటూరు, మశాకపురం, రత్తకన్న, తేలుకుంచి వంటి గ్రామాల్లోని పాఠశాలలకు, ఆస్పత్రులకు వెళ్లే ఉపాధ్యాయూ, ఇతర ఉద్యోగులకు ఈ గేట్ శాపంగా మారింది. గేటు పడితే అరగంట వరకు ట్రాఫిక్ క్లియర్ కాకపోవడంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఉద్యోగులు, విద్యార్థులు నానా కష్టాలు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా ఉద్యోగులకు బయోమెట్రిక్, ఫేస్ యాప్‌ల హాజరు కావడంతో హైరానా పడుతుంటారు.

మరుగున పడ్డ ప్రతిపాదనలు



వినియోగంలోకి లేని అండర్ పాసేజ్

రైల్వే గేట్ వేసినప్పుడు ఎం.తోటూరు అండర్ పాసేజ్ గుండా వాహనాలు రాకపోకలు సాగేవి. అయితే అండర్ పాసేజ్ పూర్తిగా మురికి కూపంగా మారడంతో పాటు చెత్తా చెదారం నిలిచిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు రైల్వే అధికారులు ఎల్‌సీ గేట్‌ను పరిశీలించిన పిదప, దాసన్నపేట యర్ర చెరువు జంక్షన్ నుంచి భవానీపురం వరకు ఫ్లైఓవర్ నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశారు. దశాబ్దాలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, ప్రస్తుత కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడులు సైతం ఫ్లైఓవర్ మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తామంటూ స్థానికులకు హామీలు సైతం ఇచ్చారు. ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉన్న రామ్మోహన్‌నాయుడు ఈ అంశంపై పునరాలోచించి ఫ్లైఓవర్ నిర్మించేందుకు కృషి చేస్తారని స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నిత్యం ఇబ్బందులే



రైల్వే గేట్ పడితే కిలో మీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోతుంది. సమస్యను పాలకులు, రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం కనిపించడం లేదు. ముఖ్యంగా డిగ్రీ, జూనియర్, హైస్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయాల్లో రోగులకు సైతం సమస్య తప్పడం లేదు. ఇప్పటికైనా రైల్వే అధికారుల స్పందించి అండర్ పాసేజ్‌ను బాగుచేయించి, ఫ్లైఓవర్ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలి.

– నరేంద్రనాథ్ పట్నాయక్, ఉపాధ్యాయుడు, కొళిగాం

నిరుపేదకు సాయం



గణేష్ తల్లిదండ్రులకు సాయాన్ని అందజేస్తున్న యువకులు

కవిటి: మండలంలోని ఆర్.బెలగాం పంచాయతీ బెలగాం కాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి గ్రామయువత ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన యువకుడు కోన గణేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. పుట్టుకతో వైకల్యంతో బాధపడుతున్న ఇతని మరణం పేదవారైన తల్లిదండ్రులకు మానసిక ఆవేదనను మిగిల్చింది. ఈ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న స్థానిక యువత పది వేల రూపాయలను విరాళాలుగా సేకరించారు. అలాగే ఈ కుటుంబం పరిస్థితిని ఎస్‌జీఎఫ్ సంస్థకు వివరించడంతో వారు కూడా రూ. ఆరు వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని మృతుడి తల్లిదండ్రులకు సోమవారం అందజేశారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

కాశీబుగ్గ: పలాస విద్యుత్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామ్మోహనరావు (సోంపేట), కార్యదర్శిగా లైన్ ఇన్‌స్పెక్టర్ తెంప తిరుపతిరావు (పలాస రూరల్), కోశాధికారిగా లైన్ మెన్ తలగాన ప్రభాకర్ (పలాస టౌన్)ను ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. రీజనల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి ఎ.రాజేశ్వరరావు పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి.

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ ఉద్యోగులు



పలాస శిరీషాతో మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, సిబ్బంది

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషాను పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఉద్యోగులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. దుశ్శాలువతో సత్కరించి.. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, ఏఈ బీర అవినాష్‌తో పాటు సచివాలయ ఇంజినీర్‌లు, ఇతర శాఖలకు చెందిన ఉద్యోగులు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలకు పరుపులు, ఫ్యాన్లు అందజేత



హెచ్‌ఎంకు ఫ్యాన్లు అందజేస్తున్న రోటరీ గవర్నర్ సుబ్బారావు

కంచిలి: నువాగడ గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం 50 పరుపులు, 10 సీలింగ్ ఫ్యాన్లను సోంపేట రోటరీ క్లబ్ వారు సమకూర్చారు. వీటిని పాఠశాల హెచ్‌ఎం దుర్గాప్రసాద్ పాఢికు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు, అసిస్టెంట్ గవర్నర్ పి.దినేష్‌కుమార్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ ఎం.భాస్కర్‌రావు, సోంపేట రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, సెక్రటరీ పి.వి.కృష్ణారావు, ట్రెజరర్ రవికుమార్‌బాబు, శివశంకర్‌రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, దున్న రమేష్, రోట్రాక్ట్ ప్రెసిడెంట్ బెనర్జీ, సభ్యులు పాల్గొన్నారు.

మంత్రులకు ఘన స్వాగతం

టెక్కలి: కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడులకు సోమవారం రాత్రి కోటబొమ్మాళి మండలం నిమ్మాడ వద్ద టీడీపీ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా బాబాయ్, అబ్బాయ్‌లు బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా స్వగ్రామం నిమ్మాడ రావడంతో పెద్ద ఎత్తున కూటమి కార్యకర్తలు పెద్దబమ్మిడి జంక్షన్‌కు చేరుకున్నారు. బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. భారీ గజమాలలు, మంగళ హారతులతో అచ్చెన్న, రామ్మోహన్‌నాయుడులకు స్వాగతం పలికారు.

సచివాలయ ఉద్యోగికి సత్కారం



ఫాల్గుణరావును సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం మాకన్నపల్లి సచివాలయంలో గ్రామ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న మాజీ సైనికుడు కొల్లి ఫాల్గుణరావు సేవలకు చక్కనైన సత్కారం లభించింది. అత్యవసర పరిస్థితిలో కష్టకాలంలో ఉన్నటువంటి పేదవారికి ఆరుసార్లు రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడినందుకు గుర్తించి గౌరవించారు. సొంపేటలో అనాథులు, వృద్ధులకు ఆశ్రయం అందిస్తున్న సీతయ్య ఫౌండేషన్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ప్రముఖలతో కలిసి సీతయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు గుల్ల మోహన్, గుల్ల రమేష్‌లు ఫాల్గుణరావును దుశ్శాలువతో సత్కరించారు.

ట్యాంకర్‌తో మంచినీటి సరఫరా



ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 13వ వార్డు దుర్గా మండపం ప్రాంతంలో మున్సిపల్ ట్యాంకర్‌తో మంచినీటిని సోమవారం సరఫరా చేశారు. నీటి సమస్య ఉన్న విషయాన్ని స్థానిక మహిళలు మున్సిపల్ వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్ బోర కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తక్షణమే మున్సిపల్ తాగునీటి విభాగంతో మాట్లాడి ట్యాంకర్‌తో నీటిని వీధుల్లోకి పంపించారు. మున్సిపాలిటీలో కుళాయిలు ఆగిపోయిన ప్రాంతాలకు ట్యాంకర్‌లతో నీటిని సరఫరా చేస్తున్నారని.. అవసరం ఉన్నవారు మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని కృష్ణారావు కోరారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు



కంచిలి: అల్లా సందేశాన్ని వినిపిస్తున్న మతపెద్ద



ఇచ్ఛాపురం: జామా మసీదులో అల్లా సందేశాన్ని వినిపిస్తున్న అహ్మద్ ఆలీ

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో జాతీయ రహదారి పక్కన గల మక్కా మసీదు ఈడిగలో సోమవారం భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు చేశారు. ఆంధ్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన లారీ డ్రైవర్లు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇందులో మసీదు అధ్యక్షుడు తాజుద్దీన్ ఖాన్, ఇమామ్ ఎండీ థాసిర్ తదితర మతపెద్దలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: బక్రీద్ సందర్భంగా లాలాపేట వద్ద గల జామామసీద్, కస్పావీధి వద్ద మసీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మతపెద్దలు అల్లా సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో జామా మసీద్ అధ్యక్షుడు అహ్మద్ ఆలీ, మత గురువు అనీసుల్‌ఖాద్రీ, ఫరీద్, సమీర్ ఆలీ, బాబుషరీఫ్, రఫీ, జిలాని, జోహార్‌ఖాన్, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: బక్రీద్ పర్వదినం సందర్భంగా టెక్కలి పట్టణంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. స్థానిక జామియా మసీదులో మత గురువు ఇఫ్తాకర్ ఆధ్వర్యంలో అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు చేసి.. శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

మల్లికార్జునస్వామికి పూజలు



మల్లికార్జునస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

టెక్కలి రూరల్: రావివలస గ్రామంలోని ఎండల మల్లికార్జున స్వామి దేవాలయంలో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

ఆక్రమణల తొలగింపు

నరసన్నపేట: స్థానిక పాతబస్టాండ్ వద్ద మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న మహిళా మార్ట్ పక్కన ఆక్రమణలను సోమవారం ఉదయం పంచాయతీ, మండల పరిషత్ సిబ్బంది సంయుక్తంగా తొలగించారు. రెండు రోజుల వ్యవధిలో మహిళా మార్ట్ పక్కన మండల పరిషత్ పాత షాపుల మధ్యన ఇద్దరు వ్యక్తులు రేకుల షెడ్, దుకాణం వేర్వేరుగా ఏర్పాటు చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న పంచాయతీ ఈఓ చిన్నారావు, మండల పరిషత్ సిబ్బంది ప్రసాద్, వెంకటరావు వెళ్లి ఆక్రమణదారులకు నచ్చజెప్పి ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు పాల్పడం మంచిది కాదని తీసివేయాలని సూచించారు. వారు మొండిగా వ్యవహరించడంతో సోమవారం ఉదయం పంచాయతీ సిబ్బంది సహకారంతో ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఈఓ చిన్నారావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు అక్రమణలకు పాల్పడం నేరమన్నారు. ఎవరు ఆక్రమణలకు పాల్పడినా ఇదే పద్ధతిన తొలగిస్తామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

హిరమండలం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సి.హెచ్.సాయిగీత అన్నారు. ఇంటి పరిసరాల్లో ఎక్కువ కాలం నీరునిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు ఉన్నచోట దోమలు ఉంటాయని, రాత్రి వేళల్లో దోమతెరలు వాడాల్నారు. దోమకాటుతో చికిన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. జ్వరం, జలుబు, దగ్గు వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాలన్నారు.

బోరుకు మరమ్మతులు



బోరును పరిశీలిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 31వ వార్డు కౌసల్యనగర్ ప్రాంతంలోని బోరు పాడైంది. దీంతో స్థానికులు నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. వార్డు మహిళలు ఈ సమస్యను ఎమ్మెల్యే గౌతు శిరీషా దృష్టికి తీసుకెళ్లారు. ఆమె మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి సరి చేయాలని సూచించారు.

దీంతో మున్సిపల్ మంచినీటి సరఫరా విభాగం సిబ్బంది సోమవారం బోరుకు మరమ్మతులు చేపట్టారు.

ఘనంగా సచ్చిదానంద స్వామి జన్మదిన వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిం దత్తనాథ క్షేత్రంలో గణపతి సచ్చిదానంద స్వామి (అప్పాజీ) జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామీజీకి పాదుగా పూజ, గురుగీత పారాయణం, లలితా సహస్రనామ పారాయణం, ఆయుష్ హోమం చేశారు. విశాఖకు చెందిన డాక్టర్ దబ్బాకుల లక్ష్మణరావు, లత దంపతులు ఆశ్రమానికి స్మార్ట్ కలర్ టీవీని బహూకరించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గవర గోవిందరావు, కమిటీ సభ్యులు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

పలు ఆలయాలలో కల్యాణ వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని పలు ఆలయాలలో జేష్ఠ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివార్లకు కల్యాణ వేడుకలు సోమవారం జరిగాయి. మొండేటివీధిలోని లలితా సమేత శివకామేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవంలో భాగంగా కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు, షిర్డీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో శివ పార్వతుల ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి కల్యాణ వేడుకలు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు.

ఉత్తరేశ్వరునికి కల్యాణం

బలగ ఉత్తరేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి కల్యాణ వేడుకలు నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులను నగరంలో ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తులను వేదికపై ఉంచి సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని జరిపించారు.

రమ్యాతిరుమలలో..

అరసవల్లి రోడ్డులోని రమ్యాతిరుమలలో వేంకటేశ్వరుని కల్యాణ వేడుకలు జరిగాయి. ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి అర్చకులు కరి రంగనాథ వేణుమాధవాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా సంప్రదాయ గురుకులం ఫ్యాకల్టీ లలీ కృష్ణ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన జరిగింది. నృత్య బృందాన్ని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఆలయ ఈవో మాధవి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కలయిక

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో జరుగుతున్న ప్రత్యేక ఆధ్యాత్మిక కలయిక కార్యక్రమానికి పలువురు స్వామీజులు సోమవారం విచ్చేశారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వవార్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు పరిసరాలలో ఉన్నటువంటి దేవాలయాలను స్వామీజీలు సందర్శించారు. 17వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కొంచాడ రాజాశ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసనంద సరస్వతి స్వామీజి పీఠాధిపతులతో విచ్చేయగా భక్తులు స్వాగతం పలికారు.



ఒకేచోట కలుసుకున్న స్వామీజీలు